క్లుప్తంగా

కైకరంలో ఉత్సాహంగా 'నేను బడికి పోతా'



కైకరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు శుక్రవారం ×నేను బడికి పోతా× కార్యక్రమంలో భాగంగా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. హైస్కూలు హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు, సహాయ హెచ్ఎం శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. వివిధ రకాల నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు.కొంతమంది పిల్లలను బడిలో చేర్పించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం కండి



ఉంగుటూరులో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శర్మ

ఉంగుటూరు: సచివాలయ ఉద్యోగులు ఈనెల 1న వృద్ధుల పింఛన్లు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీవో శర్మ అన్నారు. శుక్రవారం ఉంగుటూరు ఎంపీడీవో సమావేశపు హాలులో ఆయన సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ఉంగుటూరు మండలంలో 11,695మంది పింఛనుదారులున్నారని, వారందరికీ పంపిణీ చేసేందుకు రూ.7.80 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. బాధ్యతతో ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు.

ఆల్ ఇండియా రేడియో కీబోర్డు ప్లేయర్‌గా సాయిగణేష్



కీ బోర్డు ప్లేయర్ సాయిగణేష్

దెందులూరు: దెందులూరుకు చెందిన పిల్యాణం సాయిగణేష్ చారి విజయవాడ ఆల్ ఇండియా రేడియో జాతీయస్థాయిలో నిర్వహించిన ఆడిషన్స్‌లో బీ-గ్రేడ్ సాధించి కీ బోర్డు ప్లేయర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం దెందులూరులో పిల్యాణం సాయి గణేష్ చారి మాట్లాడుతూ ఆల్‌ఇండియా రేడియో విజయవాడలో తన తండ్రి, గురువు సంగీత ఉపాధ్యాయులు పి.హనుమంతరావు శిక్షణలో చిన్నప్పటి నుంచి సంగీతం నేర్చుకుని కచేరీలు చేశానన్నారు. ఒకవైపు సంగీత సేవ చేస్తూ ప్రస్తుతం ఎంబీఏ పూర్తి చేశానన్నారు. శుక్రవారం నిర్వహించిన జాతీయస్థాయి ఆల్ ఇండియా రేడియో ఆడిషన్స్‌లో విజయవాడ స్టేషన్‌లో కీ బోర్డు ప్లేయర్‌గా ఎంపిక కావడం మరిచిపోలేని అనుభూతి అని సాయిగణేష్ అన్నారు.

బాదంపూడి కూడలిలో మరుగుదొడ్ల నిర్మాణం



జాతీయ రహదారిని ఆనుకుని బాదంపూడి వై జంక్షన్‌లో నిర్మించిన మరుగుదొడ్లు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై సుదూర ప్రాంతాల ప్రయాణాలు చేసే వారికోసం, వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు వాహనదారులకు అనువుగా బాదంపూడి వై జంక్షన్‌లో మరుగుదొడ్లు నిర్మించారు. సేఫ్ వే సంస్థ ఆధ్వర్యంలో రూ.7లక్షలు వ్యయంతో వీటిని నిర్మించారు. కలకత్తా-చెన్నై జాతీయ రహదారిలో బాదంపూడి వద్ద ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. పార్కింగ్ చేసిన వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు, జాతీయ రహదారిపై వెళ్లే వారి కోసం మహిళలు, పురుషులకు వేర్వేరుగా నాలుగు మరుగుదొడ్లను నిర్మించారు. రాత్రి సమయాల్లో ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేసిన వారు ఉదయం నిద్రలేచి కాల కృత్యాలు తీర్చుకుని బయలు దేరివెళ్లవచ్చు.

పీజీ సెట్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన పీజీ సెట్ 2024లో వివిధ సబ్జెక్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంకాం విభాగంలో ఎస్ శ్యామ్ నాగఅచ్యుత్ 49వ ర్యాంకు, ఎంఎస్సీ జువాలజీ విభాగంలో కె.నవీన్ కుమార్, పి.దుర్గాప్రసాద్, పి.దుర్గా భాను గాయత్రి, బి.స్మితా బ్లెస్సీ, కె.స్వాతి, టి.శిరీష వరుసగా 68, 260, 455, 500, 627, 747 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఎంఏ ఎకనామిక్స్‌లో కె.రమ్యకృష్ణ 159, ఇంగ్లిషులో ఎం అనూజ 119 ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకులు ఎం విజయకుమార్, వి.వెంకట్రావు, ఎం రాంబాబు, ఎస్ సుస్వలత, ఎస్ కరుణలతలను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.

అప్రమత్తతతో అతిసార వ్యాప్తికి చెక్

- వర్షాకాలంలో అతిసార కేసుల నమోదు
- అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం
- ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారిణి, గుండుగొలను

భీమడోలు: వర్షాకాలంలో ప్రబలే ప్రాణాంతక వ్యాధుల్లో అతిసారం(డయేరియా) ఒకటి. ఈ వ్యాధి బారిన పడినవారు నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుంది. వ్యాధి కారకాలు, ముందుస్తు జాగ్రత్తలపై ప్రజలంతా అవగాహన కలిగి జాగ్రత్తలను పాటిస్తే నిర్మూలన సాధ్యమవుతుంది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు తాజా వేడి ఆహార పదార్థాలను భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం వంటి జాగ్రత్తలను అనుసరిస్తే వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని వైద్యులు అంటున్నారు. ఈ సీజన్‌లో పలు చోట్ల డయేరియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బాధితులు త్వరగా కోలుకోవడంతో సంబంధిత అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా కేసులు నమోదవుతుండడంతో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి చైతన్యవంతం చేస్తున్నారు. ఈ వ్యాధి కట్టడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుండుగొలను వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మి వివరించారు.



భీమడోలులో నీటిలో క్లోరినేషన్ శాతాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ సిబ్బంది



డ్రైనేజీలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

డయేరియా వ్యాధి లక్షణాలు

విరేచనాలు నీరు మాదిరిగా, పలుచగా అవుతుంటే అతిసారం సోకినట్లు గుర్తించాలి. వైద్య పరిభాషలో గ్యాస్ట్రో ఎంటెరైటిస్‌గా పిలుస్తారు. ఈ వ్యాధి జీర్ణవ్యవస్థకు సోకుతుంది. నీళ్ల విరేచనాలు నూటికి 70శాతం వైరస్ వల్ల వస్తాయి. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినగూడదు, తింటే వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి. కడుపులో మెలి పెట్టినట్లు నొప్పిగా ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. శరీరంలోంచి అధిక మొత్తంలో నీరు బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. నీరసంగా ఉండడం, నోరు, నాలుక పిడచకట్టుకుపోవడం, శరీరం ఎండి పోవడం, మూత్రం అసలు రాకపోవడం లేదా చాలా తక్కువగా రావడం, ముదురు పసుపు రంగులో మూత్రం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వయస్సుతో సంబంధం లేకుండా డీహైడ్రేషన్ ఏర్పడి పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం సంభవిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ వ్యాధి సోకే కాలంలో క్లోరిన్ కలిపిన నీటిని విడిగా తాగాలి. కాచి చల్లార్చిన నీటిని తాగినా మంచిదే. కుండ లేక బిందెల్లో చేతులు ముంచి మంచినీటిని తాగరాదు. కాడ గిన్నెతో నీటిని గ్లాసుల్లో పోసుకుని తాగడం మంచిది. కలుషితమైన నీరు తాగరాదు. మంచినీటి పైపులైన్ మరమ్మతులను విధిగా చేయించుకోవాలి. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. చేతి పంపులు, కుళాయిల చుట్టూ ప్లాట్‌ఫారమ్‌లను నిర్మించాలి. నిల్వ ఉన్న మాంసాహారంతో పాటు ఎలాంటి పదార్థాలను తీసుకోవద్దు. ఆహార పదార్థాలపై మూత ఉంచాలి. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత విధిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. ఇంటి పరిసరాలతో పాటు బహిరంగ మలవిసర్జన చేయరాదు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడడం అలవాటు చేసుకోవాలి. మంచినీటి చెరువు, మంచినీటి బావులు వద్ద బట్టలు ఉడకడం, పశువులు కడగడం చేయరాదు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. సూక్ష్మజీవులు చేరకుండా పరిసరాల్లో చెత్త కుప్ప, పేడ నిల్వ ఉండరాదు. ఈగలతో పాటు ఇతర కంటికి కనపడని కీటకాలు సైతం చేరకుండా ఉండేందుకు వంట పాత్రలతో మూతలు ఉంచాలి. మాంసం, కూరగాయాలు, ఫలాలు వినియోగించే ముందుకు కడగాలి. గోళ్లను ఎక్కువగా పెర గనివ్వరాదు. ఏ ప్రాంతంలోనైనా అతిసారం ఉన్నట్లయితే ఆ ప్రాంత పరిధిలోని ప్రభుత్వ వైద్యులకు సమాచారం అందించాలి.



మురుగునీరు నిల్వ లేకుండా పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తున్న సిబ్బంది



ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వివిధ శాఖల అధికారులు

గణపవరం డిగ్రీ కాలేజీలో పీజీ కోర్సు



నిర్మలకుమారి

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈవిద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ఈమేరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిందన్నారు. 2024-25లో తమ కాలేజీలో ఎంకాం కోర్సు ప్రారంభించేందుకు అనుమతి వచ్చిందన్నారు. డిగ్రీ పాసై, ఏపీపీజీ సెట్‌లో అర్హత సాధించిన వారు ఎంకాం కోర్సులో ప్రవేశానికి అర్హులని తెలిపారు.ఈ అవకాశాన్ని గణపవరం పరిసర గ్రామాల విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. పూర్తిగా గ్రామీణ ప్రాంతాలైన గణపవరం, నిడమర్రు, ఆకివీడు, ఉంగుటూరు, అత్తిలి మండలాల్లోని విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నామని ఆమె చెప్పారు. తమ కాలేజీలో పీజీ కోర్సుకు అనుమతి ఇచ్చిన ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



రామారావుగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె

దెందులూరు: రామారావుగూడెంలో శుక్రవారం విద్యుదాఘాతంతో కొత్తపల్లి రామారావుకు చెందిన గేదె మృతి చెందింది. పెట్రోలు బంకు సమీపంలో భూమికి విద్యుత్ సరఫరా కావడంతో అటుగా వచ్చిన గేదె షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె యజమాని కొత్తపల్లి రామారావు మాట్లాడుతూ ఇటీవల రూ. 85 వేలతో గేదెను కొను గోలు చేశానని, ఇలా నేలకు కరెంటు వచ్చి గేదె చనిపోతుందని తాను ఊహించలేదని వాపోయాడు. గేదె చనిపోవడంతో ఉపాధి కోల్పోయానని కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ సర్పంచ్ పుల్లా శ్రీనివాసరావు గేదె మృతి చెందిన విషయాన్ని వీఆర్వో, దెందులూరు పోలీసులకు తెలియజేశారు.

కాచి చల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలి

భీమడోలు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని, కాచిచల్లార్చిన నీరు, వేడి ఆహారం తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ అన్నారు. భీమడోలు పంచాయతీ పరిధిలో ఆర్జావారిగూడెంలో ఓ మహిళకు డయేరియా సోకిన నేపథ్యంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, గ్రామీణ మంచినీటి సరఫరాల విభాగం అధికారులు పర్యటించారు. కలుషిత ఆహారం తినడం వల్లే వ్యాధి బారిన పడిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. కోలుకుంటున్న మహిళను వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పరామర్శించి మందులను అందించారు. అనంతరం మంచినీటి నాణ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్ పరిశీలించి తగు సిబ్బందికి సూచనలందించారు. గ్రామంలోని పైపులైన్ల లీకేజీలు లేకుండా చూడాలని, గుర్తించిన చోట తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, డ్రెయినేజీలో దోమలు ప్రబలకుండా మందు పిచికారీ చేయించారు. కలుషిత ఆహారం తినడం వల్లే అతిసారం సోకుతుందని ప్రజలంతా వేడి ఆహార పదార్థాలను భుజించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రైడేను నిర్వహించారు. గ్రామంలో పురవీధుల్లో ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నిర్మూలనపై శ్రద్ధచూపాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్య సాయం పొందాలన్నారు. అనంతరం భీమడోలులో గోదావరి జలాల నాణ్యతను పరిశీలించారు. ర్యాలీ, ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ కె.రామారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, హెల్త్ సిబ్బంది మురళీ, రమేష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఆర్జావారిగూడెంలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది



మంచినీటి నాణ్యత పరీక్ష విధానాన్ని పరిశీలిస్తున్న డీఈ రమేష్



దెందులూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ ఆశావర్కర్లు, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

డయేరియాపై అవగాహన ర్యాలీ

దెందులూరు: ప్రజలందరూ ప్రభుత్వ సిబ్బందికి సహకరించాలని డయేరియాతో పాటు ఇతర వ్యాధుల నివారణకు సమష్టిగా కృషి చేయాలని పీహెచ్ఎన్ నాగేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం దెందులూరులో మలేరియా వ్యాధి నివారణ లక్షణాలు, తీసుకోవాల్సిన వైద్యసేవలపై ఆశావర్కర్లు, నర్సింగ్ విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

వ్యాధుల అదుపునకు పటిష్ట చర్యలు

నిడమర్రు: జిల్లాలో డయేరియా అదుపు చేయడానికి జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన స్టాప్ డయేరియా శిబిరాల కార్యాచరణలో భాగంగా నిడమర్రు మండలంలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. నిడమర్రులో పలు వీధుల్లో పర్యటించి డ్రెయినేజీల నిర్వహణ తనిఖీ చేశారు. చికెన్, మటన్ దుకాణాలకు వెళ్లి వాటి నాణ్యతను పరిశీలించారు. నిల్వచేసిన, పాడైన చికెన్, మటన్‌ను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు తాగే నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలన్నారు. అనంతరం మండల సమావేశ మందిరంలో మండల, గ్రామస్థాయి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డయేరియా నివారణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. డయేరియా నివారణకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లాస్థాయి సమన్వయ కమిటీని, కంట్రోలు రూంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు జూలై 1 నుంచి ఆగస్టు నెలాఖరు వరకూ డయేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. డయేరియా వ్యాప్తి చెందకుండా జిల్లాలోని 1,500 ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, 46 సీపీడబ్ల్యూ స్కీంలు, 2 వేల తాగునీటి బోర్లు, 3వేల చేతిబోరులు శుభ్రం చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. దోమల నిర్మూలనకు ప్రతి గ్రామంలో డ్రెయినేజీలు శుభ్రం చేయడం, ఫ్యాగింగ్ చేయడం వంటి కార్యక్రమాల నిర్వహణకు 1,400 మంది పారిశుద్ధ్య కార్మికులు, రెండువేల మంది పంచాయతీ సిబ్బందిని స్టాప్ డయేరియా కార్యక్రమానికి వినియోగించుకుంటున్నామని తెలిపారు. డయేరియా విషయంలో వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా డయేరియా కేసులు నమోదయితే తక్షణం స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్యశాఖ అధికారి సమిష్ట, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించేందుకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. సమావేశంలో స్థానిక మండల అధికారులు పాల్గొన్నారు.



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న డీపీవో విశ్వనాథ్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

గణపవరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని గణపవరం పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ అన్నారు. శుక్రవారం గణపవరం సచివాలయాల పరిధిలో ప్రజలకు అంటువ్యాధులు, డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీలు కోరినేషన్ చేసిన నీటినే పైపుల ద్వారా సరఫరా చేయాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని, దోమలు కుట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పిప్పర పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు శుక్రవారం గణపవరం మండలం మొయ్యేరులో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే డ్రైడేగా పాటించాలని సూచించారు. స్థానిక నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సీహెచ్‌వో విల్సన్

27న కాకినాడలో వర్క్‌షాప్

దెందులూరు: కాకినాడలో జూలై 27న నిర్వహించనున్న సమావేశానికి న్యాయవాదులు, మేధావులు, జర్నలిస్టులు తరలిరావాలని అంబేడ్కర్ ఆలోచన ఫౌండేషన్ (ఏఏఫ్) వర్క్‌షాప్‌నకు ఆహ్వానిస్తుందని ఏఫ్ చైర్మన్, న్యాయవాది పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. శుక్రవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా దెందులూరులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించే ఈ వర్క్‌షాప్‌ను న్యాయవాదులు, మేధావులు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఐఐఎస్, విద్యావైద్యరంగ అధికారులు, ప్రముఖులు హాజరై ఏఏఫ్ లక్ష్యాలను సాధించేందుకు సహకరించాలని కోరారు.

కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆందోళన

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని, రెండు వారాలుగా తాము ఆందోళన చేస్తున్నా ఇంతవరకూ యాజమాన్యం స్పందించలేదని గణపవరం సీపీఎఫ్ ఉద్యోగులు కార్మికశాఖ అధికారులకు మొరపెట్టు కున్నారు. శుక్రవారం వారు ఏలూరులోని కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం వద్ద సీపీఎఫ్ ఉద్యోగులు ఆందోళన చేశారు. కార్మికశాఖ అధికారులు శుక్రవారం ఏలూరు కార్మికశాఖ డీసీ కార్యాలయంలో యాజమాన్యం, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేయగా ఈ సమావేశానికి యాజమాన్యం తరపున ఎవరూ హాజరు కాలేదు. దీనితో కొంత సమయం వేచిచూసినా ఫలితం లేకపోవడంతో ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు కార్మికశాఖ అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కనీసం సమాచారం ఇవ్వకుండా లాభాల్లో ఉన్న కంపెనీని అకారణంగా మూసివేసి తమను వీధుల పాలు చేశారని వాపోయారు. తొలుత గణపవరంలో మూతపడిన ఫ్యాక్టరీ వద్ద అనంతరం రాజమండ్రిలోని సీపీఎఫ్ కంపెనీ గేటు ముందు ఆందోళన చేస్తున్నారు. సమస్యపై యాజమాన్యం సానుకూలంగా స్పందించడంలేదని ఉద్యోగ సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉద్యోగులకు న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానని, కంపెనీ బాధ్యులతో మాట్లాడతామని కార్మికశాఖ అధికారులు తెలియజేశారు.



ఏలూరు డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎఫ్ ఉద్యోగులు

యువకుడికి మెరుగైన వైద్య సేవలందించాలి

దెందులూరు: కొవ్వలి గ్రామానికి చెందిన గొరిపర్తి కృష్ణకుమారి కుమారుడు గొరిపర్తి గోపి ఇటీవల ఆహారం తీసుకునే విషయంలో ఏర్పడిన అనారోగ్య సమస్యతో గత నెలలో ఏలూరు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి ఆహార పేగులో ఇబ్బంది ఏర్పడిందని తెలియజేసి ఆరోగ్యశ్రీ పథకంలో సర్జరీ చేశారు. రోజులు గడిచినా గోపి ఆరోగ్యం కుదుటపడలేదు. అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ గోపిని పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ అనంతరం అధిక మోతాదులో మందులు వాడటం వల్ల రోగి పేగులు మరింతగా దెబ్బతిన్నాయని తమ శక్తిమేరకు వైద్యం చేస్తామని చెప్పారు. ఇప్పటికే రూ. 4 లక్షలు అప్పు చేసి తన కుమారుడికి వైద్యం చేయించానని, ఇప్పుడు మరోసారి ఆపరేషన్ అవసరమని డాక్టర్లు చెప్పడంతో దిక్కుతోచక స్థితిలో ఉన్నామని తల్లిదండ్రులు వాపోయారు. ఏలూరులో చికిత్స చేసిన ఆసుపత్రికి తన కుమారుడిని తీసుకువెళితే అక్కడి వైద్యులు తీవ్ర నిర్లక్ష్యంగా మాట్లాడారని బాధితుడు గోపి తల్లి కృష్ణకుమారి ఎమ్మెల్యే చింతమనేనికి వివరించారు. తన కుమారుడు మంచాన పడి ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని ఆదుకోవాలని ఆమె కోరింది. ఎమ్మెల్యే చింతమనేని ఆసుపత్రి సీఈఓతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి గోపి కుటుంబానికి సహకారం అందేలా చర్యలు తీసుకుంటానని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.



బాధితుడి తల్లితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విద్యుత్ పరికరాలను తడి చేతులతో తాకవద్దు

దెందులూరు: విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లల్లో, సమీప ప్రాంతాల్లో ఉన్న కరెంటు స్తంభాలను, కరెంటు స్విచ్ బోర్డులు, వాటర్ మోటార్లను తడి చేతులతో తాకవద్దని విద్యుత్ శాఖ ఏడీఈ త్రివాస్, దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి సూచించారు. శుక్రవారం దెందులూరు అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి కార్యాలయంలో వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చెప్పులు వేసుకుని పొడి చేతులతో విద్యుత్ పరికరాలను పట్టుకోవాలన్నారు. భద్రత దృష్ట్యా విద్యుత్ పరికరాలు వినియోగించేటప్పుడు విద్యుత్ శాఖ సూచనలు, సలహాలు పాటించాలన్నారు. మోటారు, ఇతర ఉపకరణాలకు బిగించిన వైర్ల జాయింట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

మానవత మండల అధ్యక్షుడిగా రంగరాజు

ఉంగుటూరు: మానవత మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా వేగేశ్న రంగరాజు, కార్యదర్శిగా గంజి రవికుమార్, కోశాధికారిగా పీవీవీ ప్రసాదు మరికొంత మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకానంద, మానవత విస్తరణ చైర్మన్ సాగిరాజు జానికి రామరాజు, రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, శీతాల సత్యనారాయణ, అడపా శ్రీను, గుణ్ణం బుల్లఅబ్బాయి, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత మండల నూతన కమిటీ చైర్మన్, సభ్యులు

ఆలయ చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలి

కొయ్యలగూడెం : స్వయంభుగా వెలిసిన రుక్మిణి సత్యభామ సమేత మదనగోపాల స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలని యాదవ సంఘం నాయకులు పంది ప్రభుదాస్ శుక్రవారం కోరారు. దేవదాయ శాఖ పరిధిలోని 300 ఏళ్ల నాటి చరిత్ర గల ఈ ఆలయ అభివృద్ధికి ముఖ్యపాత్ర పోషిస్తున్నామని బూసి త్రిమూర్తులు, మన్నే దుర్గ యాదవ్ అన్నారు.

ఏలూరు డిప్యూటీ కమిషనర్ రాధ బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎన్ రాధను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్‌ను డీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. గత కొంతకాలంగా ఏలూరు నగరంలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేస్తున్న రాధను తాజాగా బదిలీ చేశారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సత్యసాయి సేవాసంస్థల ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ అన్నారు. గురువారం స్థానిక రామకృష్ణాపురంలోని సత్యసాయి సేవాకేంద్రంలో 100 మంది విద్యార్థులకు ఆయన చేతులు మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్యసాయి సూచించిన మార్గంలో నడుచుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు. అందర్నీ ప్రేమించు, అందర్నీ సేవించు అనే సాయి సూక్తి స్ఫూర్తిదాయకం అన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యా సంవత్సరంలోనూ తమ సంస్థల ద్వారా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తామని తెలిపారు. పైడేటి రామారావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.